
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4 ; కనిష్ఠం 21.2



కామారెడ్డి జిల్లా వార్తలు

3

మంగళవారం 5 మార్చి 2024

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

భిక్కనూరు, మార్చి 4: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీడీవో సంతోష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆరు గ్యారెంటీల పథకాలలో అర్హత ఉండి లబ్ధి పొందనివారు ఈ సేవాకేంద్రంలో ధరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





ప్రైవేటులో ఆగని కోతలు!

- జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా పెరిగిన సిజేరియన్లు
- అర్జించేందుకే ఆపరేషన్ల వైపు మొగ్గు
- కాసుల కోసం ఆశ పడి డెలివరీలు
- సిజేరియన్లతో తల్లీబిడ్డలకు అనారోగ్య సమస్యలు
- మొదటి కాన్పులో సాధారణ ప్రసవాలే చేయాలని ప్రభుత్వ ఆదేశాలు
- అయినా.. పట్టించుకోని ప్రైవేటు ఆసుపత్రుల యాజమన్యాలు
- కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడల్లో గల పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇష్టారీతిన ప్రసవ కోతలు
- జిల్లావ్యాప్తంగా గతే ఐదేళ్లలో ప్రైవేట్ ఆసుపత్రిలో 30 వేల సాధారణ ప్రసవాలు కాగా, 70వేలకు పైగా సిజేరియన్‌లు



కామారెడ్డి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళల సాధారణ కాన్పులు పెంచడంలో ప్రైవేట్ ఆసుపత్రులు నిర్లక్ష్యం వీడడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పలు పర్యాయాలు ఆదేశించినప్పటికీ.. కాసుల కోసం ఆశ పడి ప్రైవేట్ ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా సిజేరియన్ డెలివరీలు చేస్తున్నారు. ఓవైపు ఆసుపత్రి ఖర్చులను భరించడంతో పాటు సిజేరియన్ తర్వాత వచ్చే సమస్యలను మహిళలు ఎదుర్కోవాల్సి వస్తుంది. శస్త్రచికిత్స డెలివరీలు నిర్వహిస్తేనే ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులకు కాసుల గలగలలు ఉండనుండడంతో ఆ దిశగా కాన్పులు చేస్తున్నారు. సాధారణ కాన్పుల వైపు దృష్టి సారించడం లేదు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడలలో గల పలు ప్రైవేట్ ఆసుపత్రులలో ఇష్టారీతిన ప్రసవ కోతలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యులు ముందు నుంచి సన్నద్ధం చేయకపోవడం గర్భిణి కుటుంబీకులు సాధారణ ప్రసవానికి ముందుకు రాకపోవడం, ఇతరత్రా కారణాల అందుకు దోహదం చేస్తున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రైవేటులో 70వేలకు పైగా కోతలు

జిల్లాలో గత ఐదు సంవత్సరాల కాలంలో మొత్తం రెండున్నర లక్షలకు పైగానే ప్రసవాలు జరగగా.. అందులో ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు లక్షకు పైగా, సిజేరియన్‌లు 40వేల వరకు జగిగాయి. అదేవిధంగా ప్రైవేట్ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు 30 వేలు కాగా, సిజేరియన్‌లు 70వేలకు పైగా జరగడం గమనార్హం. ఈ లెక్కలను పరిశిలిస్తే ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న సిజేరియన్ల తీరు అర్థం చేసుకోవచ్చు. కేసీఆర్ కిట్ వచ్చినప్పటి నుంచి ప్రైవేట్ ఆసుపత్రుల ధనార్జన తగ్గిపోవడం వల ఆపరేషన్లకే మొగ్గు చూపుతూ అధికారుల కళ్లు కప్పేందుకు తూతూ మంత్రంగా నార్మల్ డెలివరీలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ ఆసుపత్రులలో వసతులు సరిగా లేకపోవడం, బెడ్డులు సరిపడా లేకపోవడం, డాక్టర్ల కొరత, సిబ్బంది కొరత వల్ల డెలివరీలు చేయడం ఆలస్యం అవుతుండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తున్నారు. ఇలా వెళ్తున్న వారిని వదిలిపెట్టకుండా అవసరం లేకున్నా.. డబ్బులు అర్జించేందుకే సిజేరియన్‌లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లపై వైద్య ఆరోగ్య శాఖ పకడ్బందీగా చర్యలు తీసుకుంటేనే సిజేరియన్‌లు తగ్గే అవకాశం ఉంది. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రులలోని లోటు పాట్లపై దృష్టి సారించి అప్పుడప్పుడు జరుగుతున్న సిజేరియన్లను సైతం తగ్గించేలా చూడాల్సిన అవసరం ఎంతైన ఉంది.

సిజేరియన్ల వల్ల వల్ల అనర్థాలు

సిజేరియన్లు చేయడం వల్ల మహిళల్లో పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ డెలివరీల్లో పుట్టే చిన్నారుల కంటే సిజేరియన్లలో పుట్టే చిన్నారులకు అనేక రకాలైన సమస్యలు ఏర్పాడుతాయని అంటున్నారు. అదేవిధంగా శస్త్రచికిత్స జరిగేప్పుడు రక్తం ఎక్కువగా పోవడం వల్ల మహిళలకు ఆరోగ్యం విషయంలో ఇబ్బందులు ఏర్పడడమేకాకుండా సాధారణ ప్రసవం అయిన వారితో పోలిస్తే ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుంది. మత్తులో ఉండడం వల్ల పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వెన్నునొప్పులతో ఎక్కువ శాతం ఇబ్బందులకు గురవుతారు. మహిళలు శారిరకంగా, మనసికంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాల బేఖాతరు

గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తు అనేక రకాల నిబంధనలు తీసుకు వస్తున్నా.. అవి కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నట్లు తెలుస్తుంది. వాటిని అమలు చేయాల్సిన సంబంధిత శాఖ అధికారుల అలసత్వం వల్లే ప్రభుత్వ లక్ష్యాలు నీరు గారుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న సిజేరియన్లకు సంబంధించిన లెక్కలను చూసి కట్టడి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటూ తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రసవాలు జరుగుతున్న తీరుపై పలు సూచనలు చేయగా.. ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యవసరమైతేనే సిజేరియన్‌లు చేస్తుండగా.. ప్రైవేట్ ఆసుపత్రుల తీరు మాత్రం మారడం లేదని తెలుస్తుంది. మొదటి కాన్పు కచ్చితంగా సాధారణ ప్రసవమే చేయాలని ప్రభుత ఆదేశాలు ఉన్నప్పటికీ.. ప్రైవేటు యాజమన్యాలు బేఖాతారు చేస్తున్నాయనే వాదనలు లేకపోలేదు.



సంక్షిప్త సమాచారం



భిక్కనూరులో పోలియో చుక్కల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న లక్ష్మణ్‌సింగ్

పల్స్ పోలియోను వంద శాతం పూర్తి చేయాలి : డీఎంహెచ్‌వో

భిక్కనూరు, మార్చి 4: పోలియో చుక్కల కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో జరుగుతున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ 0నుంచి 5సంవత్సరాల లోపు ఉన్న ప్రతీఒక్క చిన్నారికి పోలియో చుక్కలను వేయాలని అన్నారు. ఆశాలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది ప్రతీగ్రామంలో ఇంటింటా తిరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి హేమిమా, సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీడిప్‌లో ప్రయాణికుల ఎంపిక

కామారెడ్డి రూరల్, మార్చి 4: ఉమ్మడి జిల్లాలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీడిప్ బాక్స్‌లలో ఎంపికైన 10 మంది పేర్లను ఆర్టీసీ అధికారులు సోమవారం ప్రకటించారు. ఇందులో జిల్లాకు చెందిన ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. వారిలో కామారెడ్డి డిపో నుంచి ప్రయాణం చేసిన సంధ్య, బాన్సువాడ డిపో నుంచి ప్రయాణం చేసిన సంజీవ్‌కుమార్, భరత్‌కుమార్‌లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మద్నూర్, మార్చి 4: మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో మంగళవారం జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, డోంగ్లీ మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ వేదికను నిర్వహిస్తున్నట్లు మద్నూర్ ఏఈ అరవింద్ తెలిపారు. డీఈ కామేశ్వర్ రావు వస్తున్నారని, ఆయా మండలాల విద్యుత్ వినియోగదారులు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బీబీపేట,మార్చి 04: గృహజ్యోతి పథకంలో భాగంగా లబ్ధిదారులకు 200 యూనిట్ల కోసం ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ కనెక్షన్ పథకాన్ని లబ్ధిదారులకు అందజేయడంతో మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేష్ మాట్లాడుతూ పేద ప్రజలు కనీస అవసరాలైన విద్యుత్, గ్యాస్‌లను అందించి పేదల అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వమని అన్నారు. ఇందులో జిల్లా కార్యదర్శి భూమాగౌడ్, నాయకులు సలీం, శ్రీహరి, మహేష్, తోట రమేష్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు హైవే విస్తరణకు శంకుస్థాపన

- పటాన్ చెరువు 'విజయ సంకల్ప సభ'లో వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- రూ. 900 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు
- పూర్తయిన హెచ్‌ఎంబీ 765డి జాతీయ రహదారి సర్వే పనులు



పనులు జరుగనున్న హైదరాబాద్, మెదక్, బోధన్ ప్రధాన రహదారి



నాగిరెడ్డిపేటలో రోడ్డు విస్తరణ కోసం సర్వే పనులు నిర్వహిస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట, మార్చి 4: హైదరాబాద్-మెదక్-బాన్సువాడ, (హెచ్‌ఎంబీ) 765డి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కోసం రూ.900 కోట్ల వ్యయంతో జరగనున్న రోడ్డు విస్తరణ పనులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. మంగళవారం పటాన్ చెరువులో నిర్వహించే విజయ సంకల్ప సభలో మోదీ పాల్గొని ఈ రోడ్డు విస్తరణ పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులను మంజూరు చేసింది. అంతేకాకుండా హైదరాబాద్ నుంచి మెదక్ వరకు జాతీయ రోడ్డు విస్తరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ మీదుగా నిజామాబాద్ జిల్లా రుద్రూరు వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ రోడ్డు విస్తరణ పనులను రెండు ప్యాకేజీల ద్వారా జరపనున్నారు. మెదక్ జిల్లా కేంద్రం నుంచి ఎల్లారెడ్డి వరకు సుమారు 43, 91 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరించడానికి రూ. 400 కోట్లు, ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడ మీదుగా రుద్రూరు వరకు సుమారు 51. 66 కిలో మీటర్ల పొడవు రోడ్డు విస్తరణ పనుల కోసం రూ.500 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. రోడ్డు విస్తరణ పనుల కోసం అధికారులు సర్వేలు పూర్తి చేశారు. రోడ్డు విస్తరణకు సంబంధించి భూ సేకరణ పనులు సైతం దాదాపుగా పూర్తయినట్లు తెలుస్తుంది.

మెదక్ నుంచి రుద్రూరు వరకు రెండు ప్యాకేజీల పనులు

మెదక్ జిల్లా కేంద్రం నుంచి రుద్రూరు వరకు రెండు ప్యాకేజీల ద్వారా రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. మెదక్ జిల్లా కేంద్రం నుంచి నాగిరెడ్డిపేట మండలం మీదుగా ఎల్లారెడ్డి వరకు ఒకటవ ప్యాకేజీ పనులుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. అలాగే ఎల్లారెడ్డి నుంచి బొగ్గుగుడిసె చౌరస్తా, మహ్మద్‌నగర్, బాన్సువాడ పట్టణం మీదుగా రుద్రూరు వరకు మరో ప్యాకేజీ కింద రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. అయితే, ఇప్పటికే జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన అధికారులు రెండుసార్లు రోడ్డు సర్వే పనులను నిర్వహించారు.

ప్రధాని శంకుస్థాపనతో పనులు వేగవంతం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపనతో హెచ్‌ఎంబీ 765డీ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం కానున్నాయి. ఈ రోడ్డును కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా గుర్తిస్తూ సుమారు ఏడాది క్రితమే నేషనల్ హైవే రోడ్డును మంజూరు చేసింది. ఈ రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రభుత్వం సుమారు 900 కోట్ల రూపాయలను సైతం మంజూరు చేయడం గమనార్హం. అయితే, జాతీయ రోడ్డు విస్తరణ పనుల శంకుస్థాపనకు జాప్యం జరగడంతో పనులు ప్రారంభం కాలేదు. సంబంధిత శాఖల అధికారులు రోడ్డు సర్వే పనులు మాత్రమే నిర్వహించారు. ప్రస్తుతం ఈ రోడ్డు విస్తరణకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా శంకుస్థాపన చేస్తుండటంతో రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభమై వేగవంతంగా జరిగి.. అతి త్వరలోనే పూర్తికానున్నాయి. ఈ రోడ్డు విస్తరణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేస్తుండటంతో మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా

- అయినా.. పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు



మంజీరా నదిలో నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

బీర్కూర్, మార్చి 4: మండలంలోని బరంగేడ్గి, దామరంచ గ్రామాల నుంచి గత పది రోజులుగా అడ్డగోలుగా ఇసుక రవాణా జోరుగా కొనసాగుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. అయితే అధికారులు అక్రమార్కులకు పూర్తి అండదండలు అందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్‌కు కొంతమేర డబ్బులు వసూలు చేసి అధికారులకు ముట్టజెబుతూ అక్రమ దందా కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇసుక అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేశారు. దీంతో ఇసుక కొరత తీవ్రంగా నెలకొంది. ఎక్కడ ఇసుక లభించక గృహ నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. ఇసుకకు అనుమతులు ఇప్పించాలని పలువురు అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా అధికారులు అనుమతులు మంజూరు చేయలేదు. దీంతో ఒక్కసారిగా ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. చేసేదేమీ లేక గృహ లబ్ధిదారులు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీంతో అక్రమార్కులు ట్రాక్టర్ ఇసుకకు రూ.3-4 వేల వరకు వసూలు చేస్తున్నారు. దూరం పెరిగే కొద్ది ఇసుక రేటు కూడా పెంచేస్తున్నారు. ఇసుకకు అనుమతులు ఇవ్వకపోవడంతో అక్రమార్కులకు కాసుల పంట పడుతోంది. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, ఇసుకకు అనుమతులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 4: ఎన్నో ఇబ్బందులకు ఓర్చి వివిధ ప్రాంతాల నుంచి తమ బాధలను చెప్పుకుందామని ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదుదారుల సమస్యలను సావధానంగా విని, సత్వరమే పరిష్కరం చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 72 వినతలు వచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి 35, ఇళ్లకు సంబంధించి 7, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 13 వినతులు వచ్చాయి. ఉద్యోగాల కోసం 5, పోలీసు, మున్సిపాలిటి శాఖలకు సంబంధించి 3, అలాగే గిరిజన, ఎక్సైజ్, డీఆర్‌డీవో, లీడ్‌బ్యాంక్‌లకు సంబంధించి ఒక్కొక్క వినతిని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ కొలతలు, ధరణి, భూ సమస్యలకు సంబంధించి అధికంగా వినతులు వస్తున్నాయని తెలిపారు. మండల, డివిజన్ స్థాయిల్లో పరిష్కారమయ్యే వాటికి తక్షణమే పరిష్కరించాలని, వాజ్యానికి సంబంధించిన సమస్యలుంటే కోర్టును ఆశ్రయించాలని, లేదంటే పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. పిల్లలు తమ సంరక్షణ చూడడం లేదని, బ్యాంక్‌లోన్ మంజూరు చేయాలని, స్కూటీ కావాలని దివ్యాంగులు వినతి పత్రాలు అందజేయగా.. తగు చర్యల కోసం ఐసీడీఎస్ అధికారి బావయ్యకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజన బిల్లులను అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆరు నెలలుగా బిల్లులు బకాయిలు ఉన్నాయని, 2019 నుంచి పాత రేట్లే అమలువుతున్నాయని అన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు తగిన జీతం అందించేలా చూడాలని కోరారు. సదాశివనగర్ మండలానికి చెందిన దీకొండ కిషన్ భిక్కనూర్ ఎస్సైపై ఫిర్యాదు చేశాడు. తనను అసభ్య పదజాలంతో నిందించడంతో పాటు ఇష్టారీతిన కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

విద్యార్థులు నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

కామారెడ్డి టౌన్: తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని విద్యార్థులు నిలబెట్టుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్థిక అక్షరాస్యతపై జిల్లాస్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, పోస్టర్ మేకింగ్, పెయింటింగ్ పోటీలలో విజేతలకు నగదు ప్రోత్సాహక పురస్కారాన్ని అందించారు. వ్యాసరచన పోటీలలో అడ్లూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రక్షిత, నినాద పోటీలో బీబీపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని రేణుక, పోస్టర్ మేకింగ్ పోటీలో అడ్లూర్ పాఠశాల విద్యార్థిని శృతిక విజేతలుగా నిలిచారని అన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మేక్ ఏ రైట్ స్టార్ట్ బికమ్ ఫైనాన్షియల్‌స్మార్ట్ అనే థీమ్‌పై అక్షరాస్యత వారోత్సవాలు ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఇందులో డీఈవో రాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ సుధీర్, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు వేణుగోపాల్, నాగేందర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, విశ్వమోహన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న కలెక్టర్

బంధువు అంత్యక్రియలకు వెళ్తూ.. అనంతలోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం

● కామారెడ్డి జిల్లాలో ఘటన


జనార్దన్‌రెడ్డి(ఫైల్)


ప్రతిభ(ఫైల్

సదాశివనగర్, మార్చి 4: బంధువు అంత్యక్రియలకు వెళ్తూ.. రోడ్డు ప్రమాదం బారిన పడి దంపతులిద్దరూ మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. సదాశివనగర్‌కు చెందిన ఏనుగు జనార్దన్ రెడ్డి(47), ఏనుగు ప్రతిభ (36) భార్యభర్తలు. వ్యవసాయంతో పాటు పౌల్ట్రీ వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే, మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో.. సోమవారం అంత్యక్రియలకు భార్యభర్తలు కలిసి స్కూటీపై వెళ్లారు. పద్మాజీవాడి యూటర్న్ వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక వైపు నుంచి అతి వేగంతో ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి ఎగిరి ఇద్దరూ కింద పడ్డారు. అదే సమయంలో ఎగిరి కింద పడిన ప్రతిభపై నుంచి భారీ వాహనం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే నుజ్జునుజ్జై మృతి చెందింది. జనార్దన్‌రెడ్డి కాలుపై నుంచి సైతం వాహనం వెళ్లడంతో 75శాతం కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. తీవ్రగాయాలైన జనార్ధన్‌రెడ్డిని వెంటనే హైదరాబాద్‌కు తరలించి కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించిన కొద్ది సేపటికే తుది శ్వాసవిడిచాడు. జనార్ధన్‌రెడ్డి దంపతులకు ఇద్దరు సంతానం కాగా.. పెద్ద కొడుకు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. చిన్నకొడుకు ఇంటర్ చదువుతున్నాడు. కాగా.. అందరితో కలుపుగోలుగా ఉండే దంపతులు రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడంతో.. బంధువులతో పాటు గ్రామస్తులూ శోక సంద్రంలో మునిగిపోయారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి, మార్చి 4: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన పండారి లక్ష్మణ్(57) ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. లక్ష్మన్ గత కొన్నిరోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడట్లు తెలిపారు. ఈ విషయమై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తాగునీటి సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారు ?



బీర్కూర్‌లో జీపీ కార్యదర్శితో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీర్కూర్, మార్చి 4 : బీర్కూర్ గ్రామంలో గత నెల రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారని బీఆర్ఎస్ నాయకులు జీపీ కార్యదర్శిని నిలదీశారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులు బీర్కూర్ గ్రామ పంచాయితీకి చేరుకున్నారు. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారం తదితర సమస్యలపై జీపీ కార్యదర్శితో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని ఆయా కాలనీల్లో గత కొన్ని రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. పలుమార్లు జీపీ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాగునీటి సమస్య వల్ల ఇందిరమ్మ కాలనీ వాసులు పక్కకాలనీల నుంచి నీళ్ల తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రత్యేక అధికారి వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్క రించాలని డిమాండ్‌చేశారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్దు ల్ అహ్మద్,పోగునారాయణ, నాగరాజు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, మార్చి4: మున్సిపాలిటీ పరిధిలోని కొయ్యగుట్టకు చెందిన వ్యాపారి రమేశ్‌తో పాటు మరికొంతమంది వివిధ పార్టీలకు చెందిన వారు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం కాంగ్రెస్‌పార్టీ జెండానుఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులున్నారు.

ఎంపీ సమక్షంలో పలువురు బీజేపీలోచేరిక



ఎంపీ బీబీ పాటిల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నిజాంసాగర్, మార్చి 4: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో పలువురు నిజాంసాగర్ నాయకులు బీజేపీలో చేరారు. ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి బీబీ పాటిల్ బీజేపీలో చేరగా, ఆయనను మర్యాద పూర్వకంగా కలిసినట్లు బీజేపీలో చేరిన నిజాంసాగర్ మండల నాయకులు, పారిశ్రామికవేత్త సింగీతం అనిల్, మల్లూర్ నారాయణ రెడ్డిలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మంది నాయకులు బీజేపీలో చేరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్‌నాయకులు బోయిని సాయిలు, శ్రీకాంత్, నవీన్‌రెడ్డి,బాలు, తదితరులున్నారు.

నాటుబాంబు పేలి మహిళకు తీవ్ర గాయాలు

రామారెడ్డి,మార్చి 4:రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన శిరీష ఇంట్లో దాచి ఉంచిన నాటుబాంబులు పేలి శిరీషకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ కొండవిజయ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం అటవీ జంతువుల వేటకోసం శిరిష భర్త రవీందర్ నాటు బాంబులను ఇంట్లో దాచి ఉంచాడని దీంతో ఒక్కసారిగా బాంబులుపేలడంతో శిరిష గాయపడిందని తెలిపారు. ప్రస్తుతం శిరిష హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని ఎస్ఐ తెలిపారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం

మాచారెడ్డి,మార్చి 4:మండలంలోని సోమారంపేట గ్రామంలో రూ.10 లక్షల సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. సీసీరోడ్డుకోసం ప్రభుత్వ సలహాదారు నిధులను మంజూరుచేయించారని తెలిపారు.ఎల్లమ్మ దేవస్థానం వద్ద సీసీరోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నౌసిలాల్‌నాయక్, నారాగౌడ్, బన్సిలాల్,బాలరాజు, గంగారాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై కేసు నమోదు

తాడ్వాయి,మార్చి 4: తాడ్వాయి మండలం సంగోజీవాడి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ ఆదిన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంక టేశ్వర్లు తెలిపారు. సంగోజీవాడి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అబ్దుల్‌ఆదిన్ గత కొన్ని రోజుల నుంచి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవరిస్తూ ఇబ్బందులు గురిచేసినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసిన ట్లు ఎస్ఐ తెలిపారు. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రధానోపాధ్యా యుడు ఇలా వ్యవహరిస్తే ఎలా అని తల్లిదండ్రులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యవహరాలు మరోసారి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలనిపై అధికారులను కోరుతున్నామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్



హెల్ప్‌లైన్ సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నాగిరెడ్డిపేట, మార్చి 4 : ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు గాను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హెల్ప్‌లైన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో తాను ఎన్నికల్లో గెలిస్తే ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు హెల్ప్‌లైన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తానని మదన్ మోహన్‌రావు హామీనిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆయన హెల్ప్‌లైన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. మదనన్న మాట మీ సమస్య నా బాధ్యత పేరిట రెండు ఫోన్ నెంబర్లతో (7207976565, 7032225344) ఎల్లారెడ్డిలో క్యాంప్ కార్యాలయంలో కాల్ సెంటర్‌ల ద్వారా హెల్ప్‌లైన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలనుకుంటే, వెంటనే ఈ హెల్ప్‌లైన్‌ల నెంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యను తెలుపవచ్చు. హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన ప్రతి ఫోన్ కాల్ రికార్డు చేయబడుతోంది. హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన ప్రతి ఫోన్ కాల్‌ల ప్రజా సమస్యను తాను ప్రతిరోజు తెలుసుకుని, సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖల రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్యం తదితర శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను తనకు చెప్పుకోవడానికి ఎల్లారెడ్డికి గాని హైదరాబాద్‌కు గాని వస్తే వారికి బస్సు టికెట్ల కోసం కనీసం ఐదు వందలైన ఖర్చవుతోందని, నియోజకవర్గ పేద ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడకూడదనే లక్ష్యంతో హెల్ప్‌లైన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఎమ్మెల్యే ప్రారంభించని హెల్ప్‌లైన్ సౌకర్యాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రారంభించడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



సంగంలో జీరో బిల్లును అందజేస్తున్న ఎమ్మెల్యే

బోధన్ రూరల్, మార్చి 4: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ మండలం సంగం గ్రామంతోపాటు పట్టణంలో పర్యటించారు. మండలంలోని సంగం గ్రామంలో జీరో కరెంటు బిల్లును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలన కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్క కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును అందిస్తున్నామన్నారు. ఈసందర్భంగా లబ్దిదారులకు జీరో బిల్లులను అందజేశారు. అర్హులైన వారికి రూ.500లకే గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నామన్నారు. బోధన్ నియోజక వర్గ అభివృద్ధే తమ ధ్యేయమని పార్టీలకు అతీతంగా గ్రామాలను, పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు తెలుసుకుని అప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు ధూప్‌సింగ్, జావీద్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా వేసి వారిని ఆహ్వానించారు. అనంతరం పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో ప్రత్యేక పూ జలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కర్నె హన్మంత్‌రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ గంగా శంకర్, మండలాధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్న రవి, ఆది నారాయణ, అల్లె రమేష్, అల్లె జనార్ధన్, గణపతి రెడ్డి, కౌన్సిలర్లు శరత్ రెడ్డి, ధూప్‌సింగ్, జావిద్, అబ్దుల్లా, పాషా మొయినొద్దీన్, తలారి నవీన్ తదితరులు ఉన్నారు.

శబరిమాత ఆశ్రమంలో రూ.1లక్షమాయం

తాడ్వాయి,మార్చి4: మండల కేంద్రంలోని శ్రీ శబరిమాత ఆశ్రమంలో జమ అయిన డబ్బుల నుంచి రూ.1లక్షల మాయమైనట్లు తాడ్వాయి గ్రామం వాట్సాప్‌గ్రూప్‌లలో వార్త చక్కర్లు కొడుతుంది. అమ్మవారి డబ్బులను పకడ్బందిగా ఎవరు డ్రాచేసి ఉంటారని చర్చసాగు తుంది. శబరిమాత ఆశ్రమం ట్రస్ట్ అధ్యక్షుడు, కోశాధికారి సంతకాలను ఫోర్జరీ చేసి రూ.1లక్ష డ్రా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ఆశ్రమంలో కార్యవర్గంలో ఉంటున్న వ్యక్తులే డబ్బులను పక్క దారి పట్టించారని, ఆశ్రమంలో అవుతున్న ఖర్చులే కాకుండా లేని ఖర్చులను జమచేసి డబ్బులు పక్కదారి పట్టిస్తున్నట్లు పాలకవర్గంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన ఆశ్రమ నిర్వహకులు పకడ్బందిగా చర్యలు తీసుకోవాలని గ్రామ స్థులు కోరుతున్నారు.

సాలవ్వకు రూ.4.50లక్షలు అందజేత

రామారెడ్డి,మార్చి 4:మండలంలోని మోషంపూర్ గ్రామానికి సంబంధించిన ఎరుకల సాల్వ 15 గుంటల స్థలాన్ని వైకుంఠధామానికి అందించింది. దీంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం ఆమెకు రూ.4లక్షల 50వేల చెక్కును అందించడంతో ఇంచార్జ్ ఎంపీడీఓ సరిత పంపిణీచేశారు.

పొతంగల్‌లో పలువురు కాంగ్రెస్‌లో చేరిక

కోటగిరి,మార్చి4: పొతంగల్ మండలంలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు సోమవారం బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పొతంగల్ సాయిబాబా ఆలయం కల్యాణ మండపంలో పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పొతంగల్ మండలంలోని హెగ్డోలి, పొతంగల్, జల్లాపల్లితో పాటు పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్, షహీద్, గంగాధర్ దేశాయ్, మనోహర్, కొత్తపల్లి విండో అధ్యక్షుడు సునీల్ కుమార్, శ్రీనివాస్ రావు,పాల్గొన్నారు.

ప్రమాదబీమా పాలసీ చెక్కు అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న అధికారులు

రాజంపేట,మార్చి 4:మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బాల్‌సింగ్ గత కొన్నిరోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించాడు. గత సంవత్సరం కొండాపూర్ పోస్టుఆఫీస్‌లో టాటా ఏఐజీ 399 ప్రమాదబీమా చేయించడంతో ఎస్ఎస్‌పీఓ నిజామాబాద్ డివిజన్ అధికారి జనార్ధన్‌రెడ్డి ఆయన భార్యలాలీకి రూ.10లక్షల ప్రమాదబీమా చెక్కును అందించారు. ఈకార్యక్రమంలో అధికారులు భూమన్న, పవన్‌రెడ్డి, భిక్షపతి, వెంకటరాంరెడ్డి, మహెబూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల మండలాభివృద్ధికి నిధుల మంజూరు

ఏర్గట్ల,మార్చి4:మండలంలోని అభివృద్ధి పనులకు ఎన్ ఆర్‌ఈజీఎస్ నుంచి 55 లక్షలు నిధులు మంజూరైనట్లు మం డలంలోని కాంగ్రెస్ నాయ కులు తెలిపారు. అందులో భా గంగా సోమవారం తాళ్లరాంపూర్ గ్రామంలో రూ.10లక్షల తో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈసందర్భం గా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సోమదేవరెడ్డి మాట్లాడుతూ ఏర్గట్లకు రూ.20 లక్షలు,తాళ్లరాంపూర్‌కు రూ.15 లక్షలు, తొర్తికి రూ.5 లక్షలు, బట్టాపూర్‌కి రూ.5 లక్షలు, దోం చంద గ్రామానికి రూ.5 లక్ష లు, బాల్కొండ నియోజక వర్గం కాం గ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ము త్యాల సునీల్ కుమార్‌లు మంజూరీ చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, సోమ దేవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు గంగాప్ర సాద్, రవిరెడ్డి,గడ్డం జీవన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

రాజంపేటలో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



కళ్యాణలక్ష్మీ చెక్కులను అందిస్తున్న జడ్పీవైస్ చైర్మన్

రాజంపేట,మార్చి 4:మండల కేంద్రంలోని రైతువేదికలో కళ్యాణలక్ష్మీ చెక్కులను సోమవారం పంపిణీచేసినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన రాజంపేట 4, పెద్దయిపల్లి 1,ఆరెపల్లి తండా 1,తలమడ్ల 1 మొత్తం 7 కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీచేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజు, ప్రజాప్రతినిధులు ,నాయకులు గంగారెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట:బీబీపేట మండల కేంద్రంలోని రైతువేదికలో 20 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను జడ్పీవైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకుడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మీ పథకాన్ని అమలుచేస్తుందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఆడపిల్ల కోసం ఇలాంటి పథకం అమలుచేయడం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ వైస్‌చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు పల్లవి,నీరజ, రవి,కోఆప్షన్ మెంబర్ ఆసీఫ్, ఎంపీడీఓ పూర్ణచంద్రోదయకుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మీచెక్కుల పంపిణీ

మాచారెడ్డి:మండలంలోని గజ్యానాయక్ తండా రైతు వేదికలో సోమవారం కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్దిదారులకు జడ్పీటీసీ మినుకురి రాంరెడ్డి పంపిణీచేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ కల్యాణలక్ష్మీ పేదింటి ఆడపడచులకు వరమని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ మాలిక్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని దర్గాలో ప్రార్ధనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్ రూరల్, మార్చి 4 : బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సనాపటేల్ దర్గాలో ప్రత్యేక ప్రా ర్థనలు చేపట్టారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి బడాపహాడ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రి వర్గ విస్తరణ చేపట్టే అంశంలో ఈసారి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నియోజ కవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అశో క్ రోడేలతో కార్యకర్తలు తదిత రులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు పొలంలో పడి వ్యక్తి మృతి

రెంజల్,మార్చి4: మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన బుయ్యా నాగరాజు(40)అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పంట పొలంలో పడి మృతి చెందినట్లు ఏఎస్ఐ బాబురావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుండి బయల్దేరిన నాగరాజు రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసే సరికి పొలంలో ముక్కు మూసుకుని పడి ఉన్న నాగరాజు మృతదేహం కనిపించడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంలో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ బాబు రావు తెలిపారు

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి రిటర్నింగ్ అధికారి భుజంగ్ రావు

మద్నూర్, మార్చి 4: రాబోయే పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి రిటర్నింగ్ అధికారి భుజంగ్ రావు అధికారులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించారు. సోమవారం జుక్కల్ నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయం మద్నూర్‌లో జరిగిన సమావేశంలో సెక్టార్ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పోలింగ్ కేంద్రాలలో వసతులు, రూట్ మ్యాప్, సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎవ్వరూ నిర్లక్ష్యం చేయవద్దన్నారు. నియోజకవర్గంలోని సెక్టార్ అధికారులు పోలీస్ సిబ్బందితో సమన్వయం చేసుకుని ఎన్నికలు సజావుగా సాగడానికి కలిసి కట్టుగా కృషిచేయాలని ఆదేశించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లుతెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, నాయక్ తహసీల్దార్ భరత్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ అధికారి విజయ్, ఆర్ఐ శంకర్, 26 రూట్ల సెక్టార్ అధికారులు, పోలీస్ సిబ్బంది, జుక్కల్ నియోజకవర్గం పరిధిలోని ఎంపీడీవోలు, ఎస్సైలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో సామాజిక తనిఖీ

మద్నూర్, మార్చి 4: మద్నూర్ ఉమ్మడి మండలంలో సోవవారం సామాజిక తనిఖీ ప్రజా వేదికనిర్వహించారు. గత వారం రోజులుగా మద్నూర్, డోంగ్లీ మండలాల్లో ఉపాధి పనుల వివరాలు సేకరించి సామాజిక తనిఖీ వివరాలు సేకరించారన్నారు. 20 కోట్ల 9 లక్షల 21 వేల 1 రూపాయి పనులు జరిగినట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, ఉపాధి హామీ కింద రూ. 2 కోట్ల 29 లక్షల 78 వేల 32 రూపాయల పనులు జరిగినట్లు గుర్తించామని సామాజిక తనిఖీల్లో వెల్లడించారు. అటవీ ప్రాంతాలలో రూ.6 లక్షల 52 వేల 192 పనులు చేసినట్లు సామాజిక తనిఖీలో వెల్లడించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులను గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన అనంతరం సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్‌పంపిణీ

ఎల్లారెడ్డి, మార్చి 4:ఎల్లారెడ్డి మండలంలోని అడవి లింగాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్‌లను గ్రామ, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దయాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బీర్కూర్ మండల బీజేపీ అధ్యక్షుడిగా సాయి కిరణ్

బీర్కూర్,మార్చి 4: బీర్కూర్ మండలం బీజేపీ అధ్యక్షుడిగా నాగేళ్ళ సాయి కిరణ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు అరుణ తార నియామ క పత్రాలు అందజేసినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇది వరకు ఒకసారి అ. ధ్యక్షుడిగా చేసిన సాయి కిరణ్‌కు రెండవసారి కూడా అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని సాయి కిరణ్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రెండవసారి అధ్యక్షుడిగా నియమించినందుకు ఆయన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించ డంతో మండల బీజేపీనాయకులు, కార్యకర్తలు సాయికిరణ్‌కు అభినందనలు తెలిపారు.

మద్నూర్ బీజేపీ అధ్యక్షుడిగా తుకారాం

మద్నూర్, మార్చి 4: మద్నూర్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా తెప్పతుకారాంను జిల్లా బీజేపీ అధ్యక్షురాలు కుమారి అరుణ తార నియమించారు. గతంలో ఉన్న హన్మాండ్లు ఇంతకాలం గ్రామీణ ప్రాంతాలలో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించారన్నారు. నూతనంగా ఎన్నికైన తుకారాం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. మద్నూర్ మండలాధ్యక్షునిగా ఎన్నికైన తుకారాం మాట్లాడుతూ గతంలో మండల బీజెవైఎం యువమోర్చానాయకునిగా పనిచేసిన అనుభవం ఉందని, తనను ఎన్నుకోవడంపై ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ఆదేశం మేరకు ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులను ఆయాలుగా మారుస్తున్న టీచర్లు



టీచర్లకు భోజనం తీసుకువస్తున్న విద్యార్థులు

రాజంపేట, మార్చి 4: మండలంలోని ఆయా పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు ఆయాలుగా మారుస్తు విద్యాబోధన కంటే ఇతర పనులకు వినియోగించుకుంటున్నారు. పాఠశాలలోకి విద్యార్థి సంఘాలు, ఇతరులు రావొద్దంటూ గత ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పక్కగా అమలుచేస్తు వాటిని తమకు అనుకులంగా మార్చుకుంటున్నారు. మండలంలోని బస్వన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాలలోని కార్యాలయంలో ఉపాధ్యాయులు కాలక్షేపం చేస్తు విద్యార్థులతో చాయ్ పెట్టిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఆయాలు లేరని విద్యార్థులతో చాయ్ పెట్టించుకుంటే తప్పేముందని సమాధానం ఇస్తుండడం గమనార్హం.ఇక గుండారం ఉన్నత పాఠశాలలో గత కొద్దిరోజుల క్రితం మధ్యాహ్న భోజనంను విద్యార్థుల కోసం మరికొందరు విద్యార్థులతో తెప్పిస్తు వారితో పనులు చేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు వాపోయారు.

డొంకేశ్వర్‌లో ప్రజాపాలన సేవ కేంద్రం ప్రారంభం

డొంకేశ్వర్, మార్చి4: డొంకేశ్వర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాపాలన సేవ కేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటరమణ ప్రారంభించారు. ప్రభుత్వం అందించే గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకంలో లబ్ధిదారులకు సమస్యలు ఉన్నట్లయితే ప్రజాపాలన సేవ కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ కిషన్, కార్యదర్శి శేఖర్‌గౌడ్,సిబ్బంది,శ్రీకాంత్,ధర్మన్న, పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - హనుమాన్
శాంతి - ఊరు పేరు భైరవకోన
ప్రియా 70 - ఈగల్
ప్రియా 35 - ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ

మహేశ్వరి - గుడాచారి 111
వెంకటేశ్వర - ఆపరేషన్ వాలెంటైన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

